సాక్షి
వరంగల్
బుధవారం | 20 | నవంబర్ | 2024



.. ప్రముఖుల హస్తం?

బయ్యారం పెద్ద చెరువు కట్టపై గుప్తనిధుల కోసం ఇటీవల జరిగిన తవ్వకాల వెనుక ప్రముఖుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

- 8లో▸



అధికారుల నియామకం

కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ఇద్దరు అదనపు పరీక్షల నియంత్రణాధికారులుగా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
29^0 /15^0

వాతావరణం

జిల్లాలో ఉదయం సాధారణ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

హార్వెస్టర్‌లో పడి కొండచిలువ మృతి



రాయపర్తి: హార్వెస్టర్‌లో పడి కొండచిలువ మృతిచెందిన సంఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భీమని శ్రీనివాస్ తన వరి పంటను హార్వెస్టర్ సాయంతో కోయిస్తున్నాడు. ఈ క్రమంలో పొలంలో ఉన్న కొండచిలువ హార్వెస్టర్‌లో పడి మృతిచెందింది. కొండచిలువ సుమారు 8 అడుగుల పొడవు ఉందని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంత పెద్ద కొండచిలువ ఇక్కడికి ఎలా వచ్చిందోనని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గీసుకొండ: జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్న కారణంగా వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. నిమోనియాతో చిన్నారులకు శ్వాస సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. రోగ నిరోధక శక్తి తగ్గే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

రేపు డెడికేటెడ్ బీసీ కమిషన్ రాక

వరంగల్: హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, సభ్యులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు అవసరమైన రిజర్వేషన్లను దామాషా ప్రకారం కల్పించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజలు, సలహాలు, అభ్యర్థనలు, ఆక్షేపణలను కమిషన్‌కు సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలతో సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ప్రాంగణ నియామకాలకు రాతపరీక్ష



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రాంగణ నియామకాలకు ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఈ రాత పరీక్ష నిర్వహించగా 267 మంది హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.4 లక్షల చొప్పున వేతనం చెల్లించనున్నారు. కేయూ ఎడ్యుకేషన్, మహిళా ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రమణ, డాక్టర్ భిక్షా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు ఎ.సిద్ధార్థ, పి.సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఆ కంపెనీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిశారు.

నేడు పీజీ స్పాట్ అడ్మిషన్లు

హన్మకొండ అర్బన్: పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం బుధవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఎంఏ (తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), ఎంకాం (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), ఎమ్మెస్సీ (జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బాటనీ, మైక్రోబయోలజీ) కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సీపీజీఈటీ -2024లో అర్హత సాధించి లేదా డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

నిట్‌తో ఎంఓయూ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూ.10 కోట్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహించేందుకు మంగళవారం ఎంఓయూ కుదుర్చుకుంది. నిట్ వరంగల్, ఈ అండ్ ఐసీటీ అకాడమీ సౌజన్యంలో నిట్ మణిపూర్, కాకినాడ జేఎన్టీయూ, కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం, హైదరాబాద్ జేఎన్టీయూ, భువనేశ్వర్ ట్రిపుల్ ఐటీ, ఉస్మానియా యూనివర్సిటీ ఎంఓయూ అగ్రిమెంట్‌పై సంతకం చేసినట్లు డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. ఎంఓయూ ద్వారా నిర్వహించనున్న ప్రాజెక్టు.. 14,700 మంది అధ్యాపకులకు శిక్షణ అందించేందుకు దోహదపడనున్నట్లు తెలిపారు.

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం, నమస్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి





సీఎం పర్యటన సాగిందిలా...

- **మధ్యాహ్నం 2.39 గంటలకు:** హైదరాబాద్ నుంచి హనుమకొండకు ప్రత్యేక హెలికాప్టర్‌లో రాక.. ముందుగా నగరం మొత్తం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు.
- **2.50 :** కాళోజీ కళాక్షేత్రం ప్రాంగణంలో ప్రజాకవి కాళోజీ కాంస్య విగ్రహావిష్కరణ
- **2.54:** హనుమకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించిన రూ.4,601.15 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- **2.57 :** కాళోజీ కళాక్షేత్రం భవన ప్రారంభోత్సవం
- **2.59 :** కాళోజీ కళాక్షేత్రంలో కాళోజీ ఫొటో గ్యాలరీ సందర్శన
- **3.18 :** ఆడిటోరియాన్ని సందర్శించి.. ప్రజాకవి కాళోజీపై రూపొందించిన బయోపిక్ వీక్షణ
- **3.30 :** కాళోజీ కళాక్షేత్రం నుంచి బస్సులో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానానికి పయనం
- **3.41 :** ప్రజాపాలన విజయోత్సవ సభా ప్రాంగణానికి రాక, ఇందిరా మహిళాశక్తి స్టాల్స్ సందర్శన
- **సాయంత్రం 4.16:** మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సభా వేదికపైకి రాక, ఆ తర్వాత ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి
- **5.22:** సీఎం ప్రసంగం మొదలు.. 34 నిమిషాలు కొనసాగిన స్పీచ్
- **5.58 :** 22 జిల్లాల్లో మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన
- **6.00 :** సభాస్థలి నుంచి సీఎం హైదరాబాద్‌కు పయనం

కదిలిన మహిళాశక్తి

ఓరుగల్లుకు తరలివచ్చిన నారీ లోకం..

- 'ఇందిరా మహిళాశక్తి ప్రాంగణం' నుంచి సీఎం వరాలు
- మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తామన్న రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి
- వరంగల్ అభివృద్ధి జరిగితే సగం తెలంగాణ అభివృద్ధి చెందినట్లే..
- సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగానికి సభికులనుంచి అనూహ్య స్పందన
- అంతకుముందు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం, పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన

సాక్షి, వరంగల్:

ఓరుగల్లు వేదికగా మంగళవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు మహిళాలోకం కదిలి వచ్చింది. ఉమ్మడి జిల్లాతోపాటు ఇరుగుపొరుగు జిల్లాల నుంచి మహిళలు నగరానికి తరలివచ్చారు. ఎక్కడ చూసినా వారే కనిపించారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోని ఇందిరా మహిళాశక్తి ప్రాంగణం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆడబిడ్డలపై వరాల జల్లు కురిపించారు. 'రానున్న పదేళ్లలో మహిళలకు వడ్డీలేని రుణాలిస్తాం. సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తాం. ఒకప్పుడు టాటా, బిర్లాలుంటే.. ఇప్పుడు అంబానీ, అదానీలను మించిన పారిశ్రామికవేత్తలుగా మహిళలను మారుస్తాం' అని స్పష్టం చేశారు.

బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా..

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి హనుమకొండ 'కుడా' గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి తొలుత కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానం (ఇందిరా మహిళాశక్తి ప్రాంగణం)లో ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా 'వరంగల్ గడ్డపై రైతు డిక్లరేషన్‌తో తెలంగాణలో కాంగ్రెస్ రూపురేఖలు మారిపోయాయి. ఓరుగల్లు పోరాటంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నాం. అందుకే చారిత్రక వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. అభివృద్ధికి సుమారు రూ.ఆరువేల కోట్లు కేటాయించాం. వరంగల్ అభివృద్ధి చెందితే.. సగం తెలంగాణ అభివృద్ధి చెందినట్లే. నగరాన్ని అభివృద్ధి చేసే వరకు నిద్రపోయేది లేదు' అని సీఎం చెప్పిన మాటలకు మంచి స్పందన వచ్చింది. 'ఓరుగల్లు ఆడబిడ్డలకు మంత్రివర్గంలో ప్రముఖ స్థానం కల్పించాం. పాలకుర్తిలో ఒక రాక్షసుడిని ఓడించి అక్కడ కాంగ్రెస్ జెండాను ఎగురవేసింది మన ఆడబిడ్డనే. ఆనాడు భద్రకాళి అమ్మవారు, సమ్మక్క–సారలమ్మ తల్లుల సాక్షిగా చెప్పా.. పంద్రాగస్టులోపు రుణమాఫీ చేసి తీరుతామని 'మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం. ఇప్పుడు ఈ వేదిక మీదుగా మాట ఇస్తున్నా.. మిగిలిన అందరి రైతులకు రుణమాఫీ చేసే బాధ్యత మాది' అనడంతో ప్రజలు కేరింతలు కొట్టారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, సారయ్య, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, కమిషనర్ అశ్వినితానాజీ వాకడే పాల్గొన్నారు.

స్టెప్పులే స్టెప్పులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్లతో పాటు పలు జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో మహిళలు సభకు తరలివచ్చారు. దాదాపు లక్ష మందికిపైగా జనాలు రావడంతో కాంగ్రెస్ పార్టీలో జోష్ కనిపించింది. సీఎం రేవంత్‌రెడ్డి రాగానే.. 'మూడు రంగుల జెండా పట్టి సింహమోలే కదిలినాడు మన రేవంతన్న' అనే పాటకు మహిళలు స్టెప్పులు వేశారు. సభలో అర్జున అవార్డు గ్రహీతలు ఇషాసింగ్, నిఖత్ జరీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.





ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు, వర్చువల్‌గా ఇందిరా మహిళా శక్తి భవనాలను ప్రారంభిస్తున్న సీఎం, పక్కన మంత్రులు సీతక్క, సురేఖ, పొంగులేటి, ఎంపీ కావ్య

సభకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి దూరం

సభకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గైర్హాజరు కావడం.. మరోసారి కాంగ్రెస్‌పార్టీలో చర్చకు దారి తీసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ పాదయాత్ర సందర్భంగా మొదలైన వీరిమధ్య మనస్పర్థలు పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఇంకా సద్దుమణగలేదన్న విషయం ఈ అతిపెద్ద సభతో మరోసారి బహిర్గతమైనట్లయ్యింది. దొంతి మాధవరెడ్డి గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎం పాల్గొన్న కొన్ని కార్యక్రమాలకు హాజరుకాలేదు. ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని ఉన్నా సీనియారిటీ పరంగా సముచిత స్థానమిచ్చి గౌరవించకపోవడం వల్లనే సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే దొంతి దూరంగా ఉంటున్నారని ఆ నియోజకవర్గంలోని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

కుర్చీ దొరకక..

గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణికి సీటు దొరక్కపోవడంతో ఇబ్బందిపడ్డారు. వేదిక పైకి.. అక్కడున్న సిబ్బంది వెనకాల కుర్చీ తీసుకొచ్చి వేయడంతో ఆమె కూర్చున్నారు.

స్టాళ్ల పరిశీలన

హన్మకొండ చౌరస్తా: ఆర్ట్స్ కాలేజీ మైదానంలోని సభా ప్రాంగణం ఆవరణలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. పెంబర్తి హస్తకళలు, చెక్క ఎడ్లబండ్లు, చేర్యాల నకాషీ, పెయింటింగ్స్, మాస్కులు, ఇంటి అలంకరణ వస్తువులు, చేనేత వస్త్రాలు, నారాయణపేట చీరలు తదితర స్టాళ్లను పరిశీలించారు. స్టాళ్ల నిర్వాహకులను వ్యాపారం ఎలా ఉంది.. ఏయే వస్తువులు ఉత్పత్తి చేస్తున్నారు.. టర్నోవర్ ఎంత? వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నీ ఇలాగే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ దర్శనం.. గొప్ప అనుభూతి అని డైరీలో రాశారు. కాగా, పలు స్టాళ్ల నిర్వాహక మహిళలు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన చిత్రపటాన్ని అందజేశారు.



హాజరైన అర్జున అవార్డు గ్రహీతలు ఇషాసింగ్ (రైఫిల్ షూటింగ్) నిఖత్ జరీన్ (బాక్సింగ్)

మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

వరంగల్‌లో నార్కొటిక్ పీఎస్..
ప్రారంభించిన సీఎం

- వివరాలు 8లో▸

కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి, కోమటిరెడ్డి, సురేఖ, సీతక్క, జూపల్లి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



కాళోజీ కళాక్షేత్రం ఆవిష్కృతం

- ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రజా కవి నిలువెత్తు కాంస్య విగ్రహం ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: జిల్లా ప్రజలు, కళాకారులు, కళాభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి హనుమకొండ 'కుడా' మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా కాళోజీ కళాక్షేత్రానికి చేరుకుని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి ప్రజా కవి కాళోజీ నారాయణరావు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం హనుమకొండ, వరంగల్ జిల్లాలకు సంబంధించి రూ.4601.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వర్చువల్‌గా చేశారు. గ్రేటర్ మాస్టర్ ప్లాన్–2041 మ్యాపును విడుదల చేశారు. అనంతరం కళాక్షేత్రం భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కాళోజీ వ్యక్తిగత జీవితంలోని ప్రత్యేక క్షణాలను ప్రతిబింబించే ఫొటోలు, పురస్కారాలు, వ్యక్తిగత వస్తువులు ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. ఈసందర్భంగా కాళోజీ ఫౌండేషన్ ప్రతినిధులు వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్యమంత్రికి కాళోజీ జీవితం, అక్కడి వస్తువుల గురించి వివరించారు. అనంతరం ఆడిటోరియంలో కాళోజీ జీవిత విశేషాలతో ప్రముఖ సినీ దర్శకుడు డాక్టర్ ప్రభాకర్ జైనీ నిర్మించిన బయోపిక్‌ను వీక్షించారు. ఈసందర్భంగా ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్, ట్రస్ట్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

ఒత్తిడే కారణమా?

ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి రాజీనామాపై చర్చ

- అనారోగ్యమే కారణమని లేఖలో పేర్కొన్న అధికారి
- సహకరించని సిబ్బంది.. వరుస ఘటనలతో మనస్తాపం
- ఏడీ, ఆర్‌ఎంఓల మధ్య లోపించిన సమన్వయం
- జిల్లా వైద్యశాఖ వర్గాల్లో కలకలం

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో కొన్నేళ్లుగా ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా అధికారులు, కిందిస్థాయి సిబ్బంది వ్యవహరిస్తున్నారు. దీంతో ఎవరిపై చర్యలు తీసుకోలేక ఒత్తిడికి గురైన సూపరింటెండెంట్ డాక్టర్ మురళి తన పదవికి రాజీనామా చేశారని ఆస్పత్రిలో పలువురు చర్చించుకుంటున్నారు. కుటుంబ సమస్యలు, అనారోగ్య కారణాలతో రాజీనామా చేశానని ఆయన పేర్కొన్నారు. సహకరించని సిబ్బంది, అసిస్టెంట్ డైరెక్టర్, ఆర్‌ఎంఓల మధ్య ఏర్పడిన సమన్వయ లోపం సూపరింటెండెంట్‌కు తలనొప్పి తెచ్చిపెట్టింది. ఇటీవల నిర్వహించిన డైట్ టెండర్ల ప్రక్రియలో కూడా పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ పదవి వద్దు.. అని కొన్ని రోజుల క్రితం ఆయన సెలవుపై వెళ్లారు. సోమవారం సాయంత్రం కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డికి తన రాజీనామా లేఖను అందించారు. రాజీనామా పత్రాన్ని డీఎంఈకి పంపించామని, డీఎంఈ నిర్ణయంపై రాజీనామా ఆమోదం ఆధారపడి ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

అసలేం జరిగింది?

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా పనిచేసిన చంద్రశేఖర్ జూలై చివరి వారంలో బదిలీపై ములుగు వెళ్లారు. సీనియారిటీ ప్రకారం కొత్త సూపరింటెండెంట్‌ను నియమించే వరకు ఇన్‌చార్జ్‌గా కొనసాగాలని అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ మురళికి బాధ్యతలు అప్పగించారు. ఆస్పత్రిలో మెరుగైన సేవల కోసం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎంజీఎం ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆర్‌ఎంఓ–1 పోస్టు కొద్ది నెలలుగా ఖాళీగా ఉండడం, పెద్ద ఎత్తున సమస్యలు పేరుకుపోవడం, ఆస్పత్రిలో వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలతో మనస్తాపానికి గురైన డాక్టర్ మురళి పదవికి రాజీనామా చేయడం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో కలకలం రేపింది. కాగా, ప్రస్తుతం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ వైద్యుడు కొనసాగుతున్నారు.

ఆర్టీసీ రీజియన్ కార్యాలయ సందర్శన



ఆర్టీసీ రీజియన్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయాన్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ సందర్శించారు. మంగళవారం సీఎం హనుమకొండ పర్యటనలో భాగంగా ఆయన కార్యాలయానికి వచ్చారు. రీజియన్ పరిస్థితిని ఆర్‌ఎం డి.విజయభానును అడిగి తెలుసుకున్నారు. ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించిన ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని అడిగారు. చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయా, ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అడిగి తెలుసుకున్నారు. వెహికిల్ ట్రాకింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భానుకిరణ్, వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

- నర్సంపేట జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశాంతి



మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశాంతి

నర్సంపేట: బాల్యంలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని నర్సంపేట జైలు సూపరింటెండెంట్ లక్ష్మీశాంతి పిలుపునిచ్చారు. పట్టణంలోని మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంజీవని ఆశ్రమంలో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమను తాము ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొని చదువులో రాణించాలని కోరారు. సీడబ్ల్యూసీ మాజీ చైర్‌పర్సన్, కేయూ పాలక మండలి సభ్యురాలు కె.అనితారెడ్డి మాట్లాడుతూ బాల్యాన్ని బుగ్గిపాలు చేసుకోకుండా చదువుకోవాలని కోరారు. డాన్‌బాస్కో డైరెక్టర్ థామస్ కోసి మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన 320 మంది విద్యార్థులు నర్సంపేటను బాలల స్నేహ జిల్లాగా మార్చేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్ ఆకులపల్లి మధు, డాక్టర్ పరికి సుధాకర్, మాజీ సభ్యుడు కొండ మంజుల, అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ మోహన్‌రావు, వినోద, కుసుమ భద్రయ్య, స్వయం కృషి సేవా సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, సుదర్శన్‌గౌడ్, డాక్టర్ పాలడుగుల సురేందర్, డాన్‌బాస్కో సిబ్బంది జీవన్, శారద, రాజు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 68వ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు హనుమకొండ డీఎస్‌ఏ క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్–19 విభాగంలో ఎంపికైన బోడిక ఆర్యచంద్రారావు, బోడిక ఆర్య చక్రధర్‌రావును మంగళవారం డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ అభినందించారు. స్విమ్మింగ్ కోచ్ నవీన్‌కుమార్ ఉన్నారు.


తెలంగాణ రాష్ట్ర మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


ఎంఓయూ ఒప్పంద పత్రాలను చూపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


కాళోజీ కళాక్షేత్రంలో ఆర్ట్ గ్యాలరీని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


స్టాళ్లను సందర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



వరంగల్‌లో నార్కొటిక్ పీఎస్..



నార్కొటిక్ పోలీస్ స్టేషన్ భవనం


ఏఎన్‌బీ డీఎస్పీ సైదులు

- రిమోట్‌తో ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్: వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన వరంగల్ యాంటీ నార్కొటిక్ బ్యూరో(ఏఎన్‌బీ)పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీ మైదానంలోని మహిళా శక్తి ప్రాంగణం నుంచి రిమోట్‌తో మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వం యాంటీ నార్కొటిక్ బ్యూరో విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఇందులో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, వరంగల్ కమిషనరేట్‌లకు ఈ పోలీస్ స్టేషన్లు మంజూరయ్యాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఈ విభాగానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్లు కార్యాలయాలు ఉండగా.. వరంగల్‌లో మాత్రం వరంగల్ కమిషనరేట్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ డైరెక్టర్ చొరవతో వరంగల్‌లో ప్రభుత్వం ఇటీవల ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ప్రత్యేకంగా ఈ పోలీస్ స్టేషన్‌కు పాత భవనం కేటాయించగా మరమ్మతులు చేశారు. అనంతరం ఈ భవనాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ పోలీస్‌స్టేషన్ ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో మత్తు, గంజాయి పదార్థాల నివారణకు కృషి చేస్తుందని వరంగల్ ఏఎన్‌బీ డీఎస్పీ సైదులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కులగణనతో సామాజిక న్యాయం

- రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు పి.ఎల్ విశ్వేశ్వరరావు


మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు

కేయూ క్యాంపస్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణనతో సమాజిక న్యాయం జరుగుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వరరావు అన్నారు. పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం కాన్ఫరెన్స్ హాల్‌లో 'కులగణన-సామాజిక న్యాయం' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమగ్ర కులగణన సర్వేతో రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ వర్గాల స్థితిగతులు బహిర్గతమవుతాయన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలు లేకుండా ప్రజాస్వామ్యం లేదన్నారు. ప్రజలు కోరుకుంటోంది ఏమిటి? పాలకులు చేయాల్సిందేమిటనే అంశం ఈ కులగణన ద్వారా బహిర్గతమవుతుందన్నారు. సామాజిక ఉద్యమకారుడు కంకటి రాజారామ్ మాట్లాడుతూ సమగ్ర కులగణన సర్వే పూర్తయితే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సభకు రాష్ట్ర పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షత వహించారు. పాస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి చందా మల్లయ్య, ప్రధాన కార్యదర్శి నల్లాని శ్రీనివాస్, బాధ్యులు డి. శ్రీకాంత్ యాదవ్, వంగాల సుధాకర్, నరసింహరాములు, ఈర్ల సురేందర్, వెంకటేశ్వర్లు, మోటె చిరంజీవి పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ అయ్యాయి. ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, దీంతో తాము ఆర్థిక ఇబ్బందులతో అనివార్య పరిస్థితుల్లోనే ఈనెల 19నుంచి నిరవధికంగా కళాశాలలను బంద్ చేస్తున్నట్లు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు ఈనెల 18న కేయూ ప్రతాప్‌రెడ్డికి నోటీసు ఇచ్చిన విషయం విధితమే. అదేవిధంగా డిగ్రీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ కూడా నిర్వహించలేదు. అలాగే, ఈనెల 26నుంచి నిర్వహించబోయే డిగ్రీ మొదటి, మూడో, ఐదవ సెమిస్టర్ల పరీక్షలు కూడా నిర్వహించబోమని ఇప్పటికే ఆ అసోసియేషన్ ప్రకటించింది.

ఎస్ఆర్, వాగ్దేవి ఎంఓయూ


ఒప్పంద పత్రాలను చూపుతున్న ప్రొఫెసర్లు

మామునూరు: వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీ, వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల మధ్య విద్య, పరిశోధన, సాంస్కృతిక మార్పిడిపై (ఎంఓయూ) అవగాహన ఒప్పందం జరిగిందని రీసెర్చ్ అండ్ ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ అసోసియేట్ డీన్ డాక్టర్ రాజు తెలిపారు. ఈమేరకు మంగళవారం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఇరు కాలేజీల అధిపతులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఎస్ఆర్, వాగ్దేవి కళాశాలల ప్రొఫెసర్లు ప్రకాశ్, సయ్యద్ ముస్తాక్, బాలాజీ మారమ్, సందీప్ భట్టాచార్య, గిరిరాజన్, రేఖ గంగుల, నవీన్, దినేశ్, మనోహర్, పూర్ణచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు ఇందిరమ్మ

- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- హనుమకొండలో ప్రజాపాలన విజయోత్సవ సభ



హన్మకొండ చౌరస్తా: ఉక్కు మహిళ ఇందిరమ్మ తన పాలనలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం(ఇందిర మహిళాశక్తి ప్రాంగణం)లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఇందిరమ్మ.. తన తండ్రి నెహ్రూ నుంచి చక్కని పాలనను అలవర్చుకున్నారన్నారు. గరీబ్ హటావో నినాదంతో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆ స్ఫూర్తితో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యస్థాపనే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కాగా, ఈ సభలో అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం, ఇతర అంశాలపై ప్రసంగించారు.

హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం



ప్రభుత్వ హామీల అమలుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడం, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. కాకతీయ మహారాణి రుద్రమదేవి కత్తికి పదునెక్కువ.. కాకతీయుల కళాతోరణానికి మెరుపులు ఎక్కువ. మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. భద్రకాళీ అమ్మవారి ఆశీస్సులతో వరంగల్ నగరం అభివృద్ధి చెందుతుంది.

\- శాంతికుమారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసిన భూములు తిరిగిచ్చేస్తాం



గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నేతలు కబ్జా చేసిన దేవాదాయ, అటవీ, భూదాన భూములను త్వరలోనే తిరిగి ఆయా శాఖలకు అప్పగిస్తాం. అంతేకాదు భూములు కబ్జా కాకుండా త్వరలోనే నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకురాబోతున్నాం. ధరణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చేశాం. ధరణి పేరుతో ఎవరైతే కబ్జాలకు పాల్పడ్డారో ప్రతి గజాన్ని లబ్ధిదారులకు అందించేలా చట్టాన్ని రూపొందిస్తాం. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను మహానగరంగా తీర్చిదిద్దేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పదేళ్ల పాలనలో కేసీఆర్‌కు సొంత బంగ్లా, కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టులు నిర్మించేందుకు సమయం ఉంది కానీ మహాకవి కాళోజీ కళాక్షేత్రం పూర్తి చేసేందుకు మాత్రం నిధులకు చిత్తశుద్ధి లేదు.

\- పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

ఉద్యమానికి ఊపిరిపోసిన కవి కాళోజీ



తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలకు తన రచనలతో ఊపిరి పోసిన మహా కవి కాళోజీ నారాయణరావు. నేడు ఆయన కళాక్షేత్ర ప్రారంభోత్సవంలో సాంస్కృతికశాఖ మంత్రిగా ఉండడం సంతోషంగా ఉంది. అబద్ధాలను పదిసార్లు చెబితే నిజాలు అవుతాయనే భ్రమలో ప్రతిపక్షాలు ఉన్నాయి. కేసీఆర్ నిజంగా పాలనాదక్షుడైతే మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రం రూ. 7లక్షల కోట్ల అప్పులు ఎలా అయ్యాయో చెప్పాలి. 2023కు ముందు రైతులకు భరోసా లేదు, రేవంత్‌రెడ్డి సర్కారులో రుణమాఫీ చేశాం.

\- జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సాంస్కృతికశాఖ మంత్రి

ఆరు జిల్లాలుగా విడదీసి నాశనం చేశారు



చారిత్రక ఉమ్మడి వరంగల్ జిల్లాను గత ప్రభుత్వం ఆరు ముక్కలుగా చేసి నాశనం చేస్తే, రేవంత్ రెడ్డి సర్కారు కనీవినీ ఎరగని రీతిలో వరాల జల్లు కురిపించి అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ఆరు నెలల్లో ఆరుసార్లు సమీక్ష నిర్వహించారు. సమీక్ష అమలుకు వేలకోట్ల రూపాయలు మంజూరు చేసి చేతల ప్రభుత్వంగా నిరూపించారు. నిధులు సమకూర్చడం జిల్లా ఎమ్మెల్యేలం, మంత్రుల సమైక్య కృషి ఫలితమే. వరంగల్ జిల్లా ప్రజల పక్షాన రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయన చేసిన అభివృద్ధిని ఇక్కడి ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు.

\- నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వరంగల్ పశ్చిమ

నా అభిమాన నేత వైఎస్ రాజశేఖరరెడ్డి



నా 20 ఏళ్ల రాజకీయ జీవితంలో అభిమాన నేత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఇదీ సమస్య అని విన్నవిస్తే చాలు నిధులు కేటాయించేవారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా అభివృద్ధి కోసం కావాల్సిన నిధులు అడిగిన వెంటనే సమకూరుస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా నేను పనిచేశా. శిలాఫలకాలు తప్పితే పైసా ఇవ్వలేదు. వరంగల్ అభివృద్ధికి వారం రోజులు సెక్రటేరియేట్‌లో అధికారులతో సమీక్ష జరిపి కావాల్సిన నిధులు ఇచ్చిన రేవంత్‌రెడ్డికి ప్రజల పక్షాన ధన్యవాదాలు. దశాబ్దాల కల ఎయిర్‌పోర్టు సాకారం కానుంది. తద్వారా పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగావకాశాలు వస్తాయి.

\- కొండా సురేఖ, రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి

కులగణనకు సహకరించండి



అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన కులగణనకు ప్రజలందరూ సహకరించాలి. ఇప్పటికే 60శాతం పూర్తయింది. కొందరు కావాలని కులగణనపై దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు వాటిని నమ్మొద్దు. ఉక్కు మహిళ ఇందిరమ్మ దేశంలో పేదరిక నిర్మూలన, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేపట్టిన అనేక సంక్షేమ పథకాల స్ఫూర్తితో నేడు తెలంగాణలో ప్రజాపాలన సాగిస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇబ్బంది కలగొద్దని రూ. 240 కోట్లు వెచ్చించి మహిళా సమాఖ్యలతో కలిసి కొత్త బస్సులు కొనుగోలు చేశాం.

\- పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి

చేతల ప్రభుత్వమని నిరూపించారు



రెండు రోజులుగా ఎమ్మెల్యేలు, మంత్రుల సంతోషాలకు అవధులు లేవు. మునుపెన్నడూ లేని విధంగా నిధులు మంజూరు చేసి చరిత్ర తిరగరాశారు. కాంగ్రెస్ అంటే మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని సీఎం రేవంత్‌రెడ్డి నిరూపించారు. రెండు రోజుల్లో వరంగల్ అభివృద్ధికి రూ.5500 కోట్లు మంజూరు చేసిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిది. వరంగల్ అభివృద్ధికి నిధులు కేటాయించిన రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు ధన్యవాదాలు.

\- డాక్టర్ కడియం కావ్య, ఎంపీ వరంగల్

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



నాడు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మహిళా సమాఖ్యలకు పావుల వడ్డీ రుణాలు ఇచ్చి స్వాలంబనకు అడుగులు వేశారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. పేద మహిళలు బస్సులో ప్రయాణిస్తే బీఆర్ఎస్ నాయకులు దుర్మార్గ ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు, రూ. 500కే గ్యాస్, 2వందల యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలు మహిళల కోసమే అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌ది. కాంగ్రెస్ అంటేనే మహిళల ప్రభుత్వం. మహిళల సంక్షేమం కోసం, ఉక్కు మహిళ ఇందిరమ్మ స్ఫూర్తితో పాలన అందిస్తాం.

\- ధనసరి సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి

ప్రతీ హామీని నెరవేర్చే బాధ్యత మాది



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే బాధ్యతతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మేమందరం పనిచేస్తున్నాం. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ ఒక్కొక్కటిగా ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తాం. మహిళలకు అండగా ఉంటూ, వారి ఆర్థిక స్వాలంబనకు సహకరించడమే రేవంత్ సర్కార్ లక్ష్యం.

\- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి

అదనపు పరీక్షల నియంత్రణాధికారుల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


పద్మజ


వెంకటయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరీక్షల విభాగంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులుగా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.పరీక్షల విభాగంలోని ఎస్‌డీఎల్‌సీఈ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ. పద్మజను నియమించారు. ఇప్పటివరకు అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా నరేందర్ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో పద్మజను నియమించారు. 2010లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన పద్మజ గతంలో ఆ విభాగం బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.అలాగే కేయూ పరీక్షల విభాగం రెగ్యులర్ డిగ్రీ సెక్షన్‌లో అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌డాక్టర్ పి. వెంకటయ్య నియమిస్తూ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. 2010లో మైక్రోబయాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన వెంకటయ్య ప్రస్తుతం ఆ విభాగం అధిపతిగా, కేయూ అవెన్యూప్లాంటేషన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరిద్దరు సంవత్సరం పాటు ఆయాపదవుల్లో బాధ్యతలు నిర్వర్తిస్తారు. వీరు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

పత్తి రైతులతో వ్యవసాయ మంత్రి ముఖాముఖి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, కాటన్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్: తెలంగాణ వ్యాప్తంగా మద్దతు ధరతో చేపడుతున్న పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడినట్లు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేశ్ తెలిపారు. వరంగల్‌లోని ఆదిత్య సాయి కాటన్ స్పిన్ ప్రైవేట్ లిమిటెడ్ మిల్లులో పత్తి రైతులతో మంగళవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఐ మద్దతు ధరతో పత్తి కొనుగోలు, అమ్మకాలు, చెల్లింపుల విషయంలో రైతు సమస్యల గురించి మంత్రి తెలుసుకున్నారు. దీనికి రైతులు స్పందిస్తూ మద్దతు ధర కొనుగోళ్లలో తేమ శాతం, దిగుమతి, తూకం, చెల్లింపుల్లో ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా జరుగుతున్నాయని తెలిపారు. ఇక ముందు కూడా ఇదే విధానం కొనసాగించాలని సంబంధిత మార్కెట్ అధికారులు, సీసీఐ అధికారులను, కాటన్ అసోసియేషన్ అధ్యక్షులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ ఆర్‌జేడీ ఉప్పల శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, వరంగల్ మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, వరంగల్ జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, రైతులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల వెనుక ప్రముఖుల హస్తం?

- తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీని దారి మళ్లించేందుకు యత్నం
- పోలీసు ఉన్నతాధికారులు ఒప్పుకోకపోవడంతో స్టేషన్‌కు చేరిన యంత్రం
- మండలంలో చర్చనీయాంశంగా మారిన అధికార పార్టీ నేతల ప్రమేయం


గుప్తనిధుల కోసం తవ్విన ప్రాంతం ఇదే..

బయ్యారం: కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు కట్టపై గుప్తనిధుల కోసం ఇటీవల జరిగిన తవ్వకాల వెనుక ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మ విగ్రహం పక్కకు తీసి కొందరు వ్యక్తులు జేసీబీ ద్వారా తవ్వకాలు జరిపారు. ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారగా ఆయకట్టు రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

ఆచూకీకి ఆధారంగా మారిన జేసీబీ..

చెరువు కట్టపై గుప్తనిధుల కోసం వచ్చిన వారు జేసీబీని ఉపయోగించారు. తద్వారా ఆ యంత్రం ఎటువైపు నుంచి వచ్చిందనే విషయంపై జిల్లా సీసీఎస్, స్థానిక పోలీస్ అధికారులు పలు సీసీ కెమెరాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ కెమెరాల ఆధారంగా ఖమ్మంకు చెందిన జేసీబీగా పోలీస్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ ఆధారాలతో నిందితులను సైతం గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది.

జేసీబీని స్టేషన్‌కు తీసుకురావడంపై హైడ్రామా..

గుప్తనిధుల తవ్వకాలకు ఉపయోగించిన జేసీబీని స్టేషన్‌కు తీసుకొచ్చే విషయంపై హైడ్రామా నడిచినట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దలు ఇందులో కలగజేసుకుని జేసీబీని స్టేషన్‌కు రాకుండా వెనక్కి పంపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మళ్లీ జేసీబీని స్టేషన్‌కు తీసుకొచ్చేలా ఆదేశాలు జారీ చేశారని సమాచారం. ఇందులో భాగంగా జేసీబీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

తవ్వకాల్లో పెద్దల హస్తం ఉందా?

గుప్తనిధుల తవ్వకాల్లో పెద్దల హస్తం ఉందా అనే చర్చ మండలంలో జోరుగా సాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు పెద్దలు ఈ ఘటనలో పాల్గొన్నారని, అందుకే జేసీబీని తప్పించే యత్నాన్ని అధికారపార్టీకి చెందిన పెద్దల ద్వారా చేరవేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పోలీసులు గుప్తనిధుల తవ్వకాలపై అసలు విషయాలు వెల్లడిస్తేనే ఇందులో ఎవరి పాత్ర ఏమిటో తెలిసే అవకాశం ఉంది.

దర్యాప్తు చేపడుతున్నాం..

గుప్త నిధుల తవ్వకాల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులు, యంత్రాలపై దర్యాప్తు చేపడుతున్నాం. విచారణలో భాగంగా జేసీబీని గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చాం. ఇందులో ప్రమేయమున్న వ్యక్తుల వివరాల ఆధారాలు సేకరిస్తున్నాం. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తాం. **- తిరుపతి, ఎస్సై, బయ్యారం**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

- ముస్త్యాల పట్టణంలో ఘటన


కర్ణాకర్(ఫైల్)


సాయిబాబ(ఫైల్)

బచ్చన్నపేట : కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల పట్టణంలోని ప్రగతి పాఠశాల వద్ద జరిగింది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం .. కట్కూర్ గ్రామానికి చెందిన ఎనుగుల కర్ణాకర్ (34), దూసరి సాయిబాబ (36) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ పరికరాల కొనుగోలు నిమిత్తం చేర్యాల వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అదే రోజు రాత్రి ముస్త్యాల పట్టణం దాటిన తరువాత ప్రగతి పాఠశాల వద్ద ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ ప్రయాణిస్తున్న కర్ణాకర్, సాయిబాబ అక్కడికక్కడే మృతి చెందారు. కర్ణాకర్‌కు భార్య, ఒక కుమారుడు , కుమార్తె, సాయిబాబకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలికి చేరుకున్న చేర్యాల పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

రఘునాథపాలెం: భర్త, అత్తామామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం ఈర్లపుడికి చెందిన గుగులోత్ బాలాజీతో మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముట్టితండాకు చెందిన అనూష(28)కు 2018లో వివాహం జరిగింది. కొంతకాలంగా అనూషను ఆమె భర్త, అత్తామామలు భద్రి, మంగ్య అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 6న ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అనూష తండ్రి రూప్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

బీఆర్ఎస్‌ను విమర్శించడానికే సభ పెట్టారు

- పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి



హన్మకొండ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును తిట్టడానికి, విమర్శించడానికే హనుమకొండలో సీఎం రేవంత్ రెడ్డి సభ పెట్టినట్లు ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటున్న సీఎం రేవంత్ రెడ్డి చివరకు కేసీఆర్ ఆనవాళ్లనే ప్రారంభించడానికి వచ్చారని ఆయన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఈ ముచ్చట చెప్పడానికి ప్రభుత్వ ధనంతో ఇంతపెద్ద సభ పెట్టడం ఎందుకని, ఈ ముచ్చటే చెప్పాలంటే హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ పెడితే అయిపోయేది కదా అని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న సందర్భంగా విజయోత్సవ సభ నిర్వహిస్తామని చెప్పి, చెప్పుకోవడానికి విజయాలు ఏమీ లేక ఇందిరా మహిళా శక్తి అని చివరి నిమిషంలో సభ పేరు మార్చారని తూర్పారబట్టారు.